
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

సోమవారం 13 మే 2024



బ్యాటింగ్ చేస్తున్న సీఎస్‌కే కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్



రాజస్తాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శ్యాంసన్ బ్యాటింగ్



సీఎస్‌కే అభిమానుల కేరింతలు



సీఎస్‌కే అభిమానులతో కిక్కిరిసిన చేపాక్కం

చేపాక్ స్టేడియంలో సీఎస్‌కే చితాచితా

● రాజస్థాన్‌పై రాయల్‌గా విజయం

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): చాలాకాలం తరువాత చేపాక్ స్టేడియం పట్ట పగలు చిందేసింది. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సొంత జట్టు చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) విజృంభించింది. అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌లో రాణించి, ప్రత్యర్థి జట్టును చితగ్గొట్టేసింది. దీంతో చెన్నై క్రికెట్ అభిమానుల ఆనందానికి హద్దే లేకుండాపోయింది. ఆదివారం అందులోనూ సొంత జట్టు కావడంతో మ్యాచ్‌ను తిలకించేందుకు ప్రేక్షకులు కూడా భారీగా తరలివచ్చారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా స్టేడియానికి పరుగులు తీసారు. ఈ సీజన్‌లో ఐపీఎల్ మ్యాచ్‌లు జరిగినా, అందులో చెన్నై జట్టు వున్నా రాత్రి పూటే మ్యాచ్‌లను చూడాల్సివచ్చింది. అయితే ఆదివారం పగటిపూట సీఎస్‌కే జట్టు ఆడడంతో చాలాకాలం తరువాత చేపాక్ స్టేడియం దద్దరిల్లిపోయింది.



మ్యాచ్ వీక్షిస్తున్న నటి షామిలి, ఆమె కుమార్తె



మహాబలిపురంలో సత్యప్రద సాహు

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల ఏర్పాట్ల నుంచి ముగింపు వరకు రేయింబవళ్లు శ్రమించిన రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహూ కాస్త సేద తీరారు. ఆయన తన కుటుంబంతో కలసి మహాబలిపురాన్ని సందర్శించారు. తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ నియోజకవర్గాలకు తొలివిడతగా గత నెల 19న ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఎన్నికల భద్రతా ఏర్పాట్లు, ఓటర్లు నిర్భయంగా ఓటు వేసేలా చేపట్టాల్సిన చర్యలు, ఓటింగ్ ముగిసిన వెంటనే ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించడం, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రత తదితరాల ఏర్పాట్లన్నీ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహూ స్వీయ పర్యవేక్షణలో జరిగాయి. ఈ నేపథ్యంలో, ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో, ఒడిసా నుంచి వచ్చిన బంధువులు, కుటుంబసభ్యులతో కలసి సత్యప్రదసాహూ శనివారం మహాబలిపురానికి వచ్చారు. మహాబలిపురం సముద్రతీర ఆలయానికి వచ్చిన సత్యప్రదసాహూకు చెంగల్పట్టు జిల్లా సబ్ కలెక్టర్ నారాయణశర్మ, మహాబలిపురం పోలీసు ఇన్‌స్పెక్టర్ బాలమురుగన్, డిప్యూటీ తహసీల్దార్ సత్య, పురావస్తు శాఖ అధికారి శ్రీధర్ పుష్ప గుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అనంతరం యునెస్కో సంరక్షిస్తున్న ప్రాచీన కట్టడాలు, శిల్పాలు, అనంతరం సముద్రతీర ఆలయంలో శివుడు, విష్ణువు సన్నిధులను ఆయన సందర్శించారు. సముద్రం నుంచి వచ్చే ఉప్పు గాలులతో ప్రాచీన శిల్పాలను పరిరక్షించడం, మహాబలిపురం చరిత్ర గురించి ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రధాన అధికారి మహాబలిపురం సందర్శనలో భాగంగా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

టీవీకే పార్టీ అధ్యక్షుడిగా జోసెఫ్ విజయ్

● పేరు నమోదుకు ప్రకటన

అడయార్, మే 12 : అగ్రహీరో విజయ్ స్థాపించిన 'తమిళగ వెట్రి కళగం' పార్టీ పేరు భారత ఎన్నికల సంఘంలో నమోదైంది. ఆ పార్టీ అధ్యక్షుడిగా జోసెఫ్ విజయ్ అలియాస్ విజయ్ కొనసాగుతారు. పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ అలియాస్ మునుస్వామిని ఎంపిక చేశారు. పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శిగా రాజశేఖర్ పేరు ప్రకటించారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ప్రకటనలో ఈ పార్టీ అధ్యక్షుడు, నిర్వాహకుల పేర్లు వెల్లడయ్యాయి. ఇందులో తమిళగ వెట్రి కళగం పేరు నమోదులో ఎవరికైనా ఆక్షేపణలు, అభ్యంతరాలు ఉంటే తెలియజేయాని ఈసీ విడుదల చేసిన ప్రకటనలో



పేర్కొంది. ఈ పత్రికా ప్రకటనలో పేర్కొన్న అంశాలను పరిశీలిస్తే... 'తమిళగ వెట్రి కళగం అనే పేరుతో రాజకీయ పార్టీ పేరును రిజిస్టర్ చేయనున్నాం. తమను ఒక రాజకీయ పార్టీగా గుర్తించి, నమోదు చేయాలని ఆ పార్టీ ప్రతినిధులు ప్రజా ప్రాతినధ్య చట్టం మేరకు 1951 సెక్షన్ 29ఏ కింద దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో పార్టీ అధ్యక్షుడిగా జోసెఫ్ విజయ్, ప్రధాన కార్యదర్శిగా ఆనంద్ అలియాస్ మునుస్వామి, ప్రధాన కార్యాలయ కార్యదర్శిగా రాజశేఖర్, ప్రచార సహాయ కార్యదర్శిగా తాహీరాలను నియమించారు. దీనిని నమోదు చేసుకున్నాం' అని ప్రకటనలో పేర్కొంది. ఇదిలా వుండగా ఇందులో పార్టీ అధ్యక్షుడి పేరును జోసెఫ్ విజయ్ అని పేర్కొనడం గమనార్హం. కాగా, ఈ పార్టీ పేరు ప్రకటించిన తర్వాత ఇప్పటివరకు సభ్యత్వం కోటి వరకు చేరుకున్న విషయం తెల్సిందే.


'సెల్ఫ్ బిల్డింగ్ స్కీమ్'లో 28 వేల గృహాల నిర్మాణం

● సరికొత్త రికార్డు నెలకొల్పిన సర్కారు

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైన మూడేళ్ళ కాలంలో తమిళనాడు సెల్ఫ్ బిల్డింగ్ స్కీమ్ కింద 28,824 బహుళ అంతస్తుల గృహాలను నిర్మించి రికార్డు సృష్టించింది. ఈ గృహాలు తమిళనాడు అర్బన్ హేబిటేట్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో జరిగినట్టు ప్రభుత్వం ఆదివారం ప్రకటించింది. రాష్ట్రంలో సీఎం స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ పలు రికార్డులను నెలకొల్పుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా మూడేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో గత మూడేళ్ళ కాలంలో ప్రభుత్వ సాధించిన ప్రగతిని వివరిస్తూ ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. డీఎంకే ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు తమిళనాడు అర్బన్ హెబిటేట్ డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో 92 ప్రాజెక్టుల కోసం రూ.3,197,.94 కోట్లతో 28,824 గృహాలను హౌసింగ్ బోర్డు నిర్మించి, వీటిని పేద, మధ్యతరగతి ప్రజలకు అప్పగించారు. ఈ ప్రభుత్వం ఇప్పటివరకు 37,720 హౌసింగ్ బోర్డు గృహాలకు సంబంధించిన కేటాయింపు (అలామెంట్ ఆర్డర్) పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. మరో 3,023 హౌసింగ్ బోర్డు గృహాలకు సంబంధించి విక్రయ పత్రాలు, 1,733 డెవలప్‌మెంట్ ప్లాట్లకు విక్రయ పత్రాలను అందజేశారు. అంతేకాకుండా, ఈ పథకం కింద రూ.2,078.37 కోట్లతో కొత్తగా 69,701 కొత్తగా ప్రత్యేక గృహాల నిర్మాణం కోసం ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. శిథిలావస్థకు చేరిన హౌసింగ్ బోర్డు ఇళ్లను పునర్నించే పథకంలో భాగంగా 17 ప్రాజెక్టులకు అనుమతిచ్చి 7,582 ఇళ్లను కూల్చివేసి, ఆ ప్రాంతంలోనే కొత్తగా రూ.1,608.88 కోట్లతో 9,522 కొత్త గృహాలను నిర్మించేందుకు అవసరమైన పనులు సాగుతున్నాయి. చెన్నై సహా ఇతర నగరాల్లో ఉన్న 79 ప్రాజెక్టులకు 31,239 బహుళ హౌసింగ్ బోర్డు గృహాలకు మౌలిక సదుపాయాల రూపకల్పన కోసం రూ.82.57 కోట్లతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.



వేడుకగా టీబీఎం 'ఉగాది పురస్కారాలు' ప్రదానోత్సవం



పురస్కారగ్రహీతలతో డా.శివకుమరన్, కల్య రఘుకుమార్, గోటేటి వెంకటేశ్వరరావు తదితరులు

ప్యారీస్, మే 12: తెలుగు బ్రాహ్మణ మహాసభ (టీబీఎం) ఆధ్వర్యంలో ఆదివారం క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు, త్యాగరాజ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. టి.నగర్ బజుల్లా రోడ్డులోని రామకృష్ణ మిషన్ మహోన్నత పాఠశాల ప్రాంగణం ఇన్ఫోసిస్ హాలులో మధ్యాహ్నం 4.25 గంటలకు గణపతి పూజ, పంచాంగ శ్రవణంతో వేడుకలు ప్రారంభించారు. టీబీఎం అధ్యక్షుడు కల్య రఘుకుమార్ సభకు అధ్యక్షత వహించి ప్రారంభ ఉపన్యాసం చేశారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం 1983వ సంవత్సరం తెలుగు ఉగాది పర్వదినాన ప్రారంభించిన టీబీఎం 40 ఏళ్లుగా విద్యాదానం, ఉద్యోగావకాశాలు, సంస్కృతి పరిరక్షణ, స్వయంవరం తదితర కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఉగాది వేడుకల్లో పలు రంగాలకు చెందిన ప్రముఖులను, వేద పండితులు, సంగీత విద్వాంసులకు పురస్కారాలు అందించి, నగదు బహుమతితో సత్కరిస్తున్నామని, గత 25 ఏళ్లుగా టీబీఎం విద్యాధన్ ట్రస్ట్ తరపున పేద విద్యార్థులకు విద్యా ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు చెప్పారు. సభ్యులు, పలువురు దాతల సహకారంతో ఈ సేవలు విజయవంతంగా కొనసాగించగలుగుతున్నామని రఘుకుమార్ తెలిపారు. ఉపాధ్యక్షుడు గోటేటి వెంకటేశ్వరరావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, ప్రధాన కార్యదర్శి ఎస్.జయరామన్, ట్రెజరర్ టి.శంకర్, ఉపాధ్యక్షులు ఎల్.సాయినాథ్, ఆర్.బాలాజి, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి డా.ఎం.శివకుమరన్ టీబీఎం 40 ఏళ్లుగా కొనసాగిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం బ్రహ్మశ్రీ గురువెంకట ప్రసన్న బాలచంద్ర శర్మ తరపున ఆయన శిష్యుడు శ్రీనివాసశర్మకి ఉగాది పురస్కారం అందజేశారు. ప్రముఖ వయొలిన్ విద్వాంసులు పుదుకోట ఆర్.జయశంకర్, ఆర్.అంబికా ప్రసాద్‌లకు 'వాద్య విద్యా ప్రవీణ', తిరువళ్లూర్‌కు చెందిన గో సంరక్షణ సంస్థ నిర్వాహకులు ఆర్.రఘురామ్‌శర్మకు 'సమాజసేవా రత్న' పురస్కారంతో పాటు నగదు బహుమతి అందజేసి సత్కరించారు. చివరగా త్యాగరాజ ఉత్సవం సందర్భంగా జయశంకర్, అంబికా ప్రసాద్ సోదరుల వయొలిన్ వాద్య సంగీత విభావరి శ్రోతలను అలరించింది.

16 వరకు 5 జిల్లాలకు ఎల్లో అలెర్ట్

● వాతావరణ శాఖ హెచ్చరిక

అడయార్, మే 12: రాష్ట్రంలో ఐదు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఈ నెల 16వ తేదీ వరకు ఈ ఐదు జిల్లాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్ర వ్యాప్తంగా గత కొన్ని రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. ముఖ్యంగా వేసవిలో ఈ ఎండల తీవ్రత పలు ప్రాంతాల్లో రికార్డు స్థాయిలో నమోదువుతున్నాయి. ఈరోడ్, సేలం, నామక్కల్, వేలూరు జిల్లాల్లో ఈ ఉష్ణోగ్రతలు 110 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదువుతుంది. దీంతో ప్రజలు పగటిపూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడిపోతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఈ నెల 16వ తేదీ వరకు ఐదు జిల్లాలకు తేలికపాటి నుంచి భారీ వర్ష సూచన ఉందని తెలియజేస్తూ ఎల్లో అలెర్ట్ వాతావరణ శాఖ జారీచేసింది. దక్షిణ కేరళ, దాని పరిసర ప్రాంతాల్లో బాహ్య ఉపరితల ద్రోణి ప్రభావం కారణంగా నీలగిరి, కోయంబత్తూరు, తేని, దిండిగల్, విరుదునగర్, తెన్‌కాశి, తిరునెల్వేలి, కన్నియాకుమారి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం తేలికపాటి వర్షపు జల్లులు కురుస్తాయని వెల్లడించింది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో భారీ వర్షపు జల్లులు పడుతున్నాయి. ఇదే పరిస్థితి ఈ నెల 16వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొంది. తమిళనాడు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

ఆదివారం చెన్నైలో జరిగిన మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.సెంథిల్‌కుమార్ కుమార్తె దీపాంజలి-సూర్య నారాయణన్‌ల వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు డీఎంకే సీనియర్ నేత ఎ.రాజా, మాజీ ఎమ్మెల్యే శంకరి నారాయణన్, వధూవరుల తల్లితండ్రులు కూడా చిత్రంలో వున్నారు



రాష్ట్రంలో కరోనా వ్యాక్సిన్ దుష్ప్రభావం లేదు

గ్రామీణ నర్సులకు వేతనం పెంపు ● ఆరోగ్య మంత్రి సుబ్రమణ్యం



చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తిని అడ్డుకునే చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రజలకు వేసిన కోవిషీల్డ్ టీకా కారణంగా ఎలాంటి దుష్ఫలితాలు లేవని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం స్పష్టం చేశారు. ఈ టీకా వేసుకున్న వారిలో రక్తం గడ్డకట్టినట్టుగా ఎలాంటి ఫిర్యాదులు రాలేదని పేర్కొన్నారు. ప్రపంచ నర్సుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం తమిళనాడు ప్రభుత్వ నర్సుల సంఘం నిర్వాహకులతో సమావేశమైన మంత్రి.. నర్సులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతేగాక నర్సులకు ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని ప్రభుత్వం చేసిన మంచి పనులను ఆయన వివరించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... 1,912 మంది తాత్కాలిక నర్సులను పర్మినెంట్ చేసినట్టు చెప్పారు. ప్రజల వద్దకే వైద్యం పథకం కింద ఎంపిక చేసిన 10,969 మంది హెల్త్ వర్కర్లకు ఇచ్చే గౌరవ వేతనాన్ని రూ.5,500కు పెంచామన్నారు. నర్సుల బదిలీలు, కౌన్సిలింగ్ సుదీర్ఘకాలంగా గందరగోళంగా ఉందన్నారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 9,535 నర్సులకు కౌన్సిలింగ్ నిర్వహించి బదిలీ అవకాశం కల్పించినట్టు తెలిపారు. 2,400కు పైగా గ్రామ ఆరోగ్య నర్సులను ఎంఆర్‌పీ అనే విధానం ద్వారా పారదర్శకంగా ఎంపిక చేసినట్టు తెలిపారు. ఉత్తమ నర్సుగా ఎంపికచేసి అవార్డుతో పాటు ప్రోత్సాహక నగదు బహుమతి అందజేయాలన్న వినతి మేరకు, లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఉత్తమ నర్సులను ఎంపిక చేసి సీఎం స్టాలిన్ చేతుల మీదుగా అవార్డులు అందజేస్తామన్నారు. కరోనా సమయంలో వేసిన కోవిషీల్డ్ టీకాల వల్ల రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి దుష్ప్రభావాలు కనిపించలేదన్నారు. సాధారణంగా రోగనిరోధక శక్తి తక్కువగా ఉండేవారిలోనే ఏదేని అనారోగ్య సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. అందువల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకునేందుకు మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవడంతో పాటు ఆహార పద్ధతులను మార్చుకోవాలని మంత్రి సుబ్రమణ్యం సూచించారు.

సమాచార దర్శిని

నేటినుంచి ప్రజ్ఞ వేసవి శిబిరం

ప్యారీస్, మే 12: జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై ఆధ్వర్యంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ మంగళా శాసనాలతో ప్రజ్ఞ వేసవి శిబిరం సోమవారం ప్రారంభమై ఈ నెల 18వ తేది వరకు జరుగనుంది. మైలాపూర్ లజ్ చర్చి రోడ్డులోని ఆంధ్ర మహిళా సభ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ హాలులో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు 5 నుండి 12 ఏళ్ల చిన్నారులు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. పేర్లు నమోదు చేసుకోదలచిన వారు 9884526116 అనే నెంబరు సంప్రదించాల్సిందిగా జెట్ చెన్నై విభాగం అధ్యక్షులు రవీంద్రకుమార్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

టీఎన్‌పీఎస్సీ ఫలితాల విడుదల

పెరంబూర్, మే 12: రాష్ట్ర ఉద్యానవన శాఖలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ (విస్తరణ), హార్టికల్చర్ ఆఫీసర్, అగ్రికల్చర్ ఆఫీసర్ సహా 159 పోస్టుల భర్తీకి గత ఏడాది మే 20,21 తేదీల్లో ఆన్‌లైన్‌లో రాతపరీక్ష నిర్వహించారు. పరీక్షలో సాధించిన మార్కులు, పరీక్ష నోటిఫికేషన్‌లో ప్రచురించిన నిబంధనల ఆధారంగా 176 మందిని ఎంపిక చేయగా, ఆ జాబితా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేసినట్లు ఆ విభాగం పరీక్షల నియంత్రణ అధికారి అజయ్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫొటోగ్రఫీపై పోటీలు

వేళచ్చేరి, మే 12: మెడ్రాస్ ఫొటోగ్రఫీ సొసైటీ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించనున్నారు. బ్లాక్ అండ్ వైట్, కలర్, ప్రకృతి, ఫొటో జర్నలిజం, ప్రపంచ భద్రత తదితర ఐదంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఒక వ్యక్తి ఒక విభాగం ఫొటో, ఐదు విభాగాల ఫొటోలు కూడా పంపించవచ్చు. ఆసక్తి ఉన్న వారు జూన్ 15వ తేదీలోగా ఫొటోలు పంపించాలి. వివరాలకు 7530093570 నెంబరు సంప్రదించవచ్చు.

నేటినుంచి వడపళనిలో వైకాశి బ్రహ్మోత్సవాలు

వేళచ్చేరి, మే12:వడపళని ఆలయ వైకాశి విశాఖ బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 6 గంటలకు ధ్వజారోహణంతో ప్రారంభం కానున్న ఈ వేడుకల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం ఉత్సవమూర్తులు వివిధ వాహనాల్లో విహరించనున్నారు. వేడుకల్లో ప్రధానాంశమైన రథోత్సవం ఈ నెల 19వ తేది ఉదయం జరుగనుంది. 22వ తేది ఉదయం 10 గంటలకు తీర్థవారి, సాయంత్రం తిరుకల్యాణం జరుగనుందని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.

జలాశయాల్లో 47 శాతం నీటినిల్వలు

వేళచ్చేరి, మే 12: నగరానికి తాగునీరందించే ఐదు జలాశయాల్లో 47 శాతం మేర నీటినిల్వలున్నాయి. ఆ ప్రకారం, పూండి జలాశయంలో 23.37 శాతం, చోళవరంలో 9.81 శాతం, పుళల్‌లో 86.96 శాతం, చెంబరంబాక్కంలో 58.63 శాతం, తేర్వాయ్ కండిగై జలాశయంలో 71.80 శాతం నీటినిల్వలున్నాయి. ఆ గణాంకాల ప్రకారం ఐదు జలాశయాల్లో 6.2 టీఎంసీల నీటి నిల్వలున్నాయని, ఈ నీటితో వేసవిలో కొరత లేకుండా నీరు అందించవచ్చని ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

స్థానిక సంస్థల విద్యుత్ బకాయిలు రూ.1,365 కోట్లు

వేళచ్చేరి, మే 12: రాష్ట్రంలోని స్థానిక సంస్థల విద్యుత్ బకాయిలు రూ.1,365 కోట్లకు చేరుకున్నాయి. స్థానిక సంస్థలు వినియోగించే విద్యుత్ ఛార్జీల చెల్లింపుకు 60 రోజులు గడువు ఇస్తుంటారు. ఆ ప్రకారం చెన్నై కార్పొరేషన్ విద్యుత్ బకాయిలు రూ.17.55 కోట్లు, ఇతర కార్పొరేషన్ల బకాయిలు రూ.135 కోట్లున్నాయి.మున్సిపాలిటీలు రూ.61కోట్లు, పంచాయతీలు రూ.1,026 కోట్ల మేర విద్యుత్ బకాయించాయని, బకాయిలు వెంటనే చెల్లించాలని లేఖలు రాసినట్లు విద్యుత్‌బోర్డు అధికారులు తెలిపారు.

పెరిగిన పవన విద్యుత్

వేళచ్చేరి, మే 12: రాష్ట్రంలో పవన విద్యుత్ 2,000 మెగావాట్లకు పెరిగిందని విద్యుత్ బోర్డు తెలిపింది. మే నుంచి సెప్టెంబరు వరకు పవన విద్యుదుత్పత్తి సీజన్. రాష్ట్రంలో వేసవి ప్రభావంతో విద్యుత్ వినియోగం పెరిగింది.రాష్ట్రవిద్యుత్‌బోర్డు చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈనెల 2వతేది రాష్ట్ర విద్యుత్ వినియోగం 20,830 మెగావాట్లకు చేరింది. అదే సమయంలో, రాష్ట్రంలో 10,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ప్రైవేటు పవన విద్యుత్ కేంద్రాలున్నాయి. వాటి నుంచి యూనిట్ రూ.3.10కి విద్యుత్ బోర్డు కొనుగోలు చేస్తోంది. థర్మల్ విద్యుత్‌తో పోల్చితే పవన విద్యుత్ ఛార్జీలు తక్కువగా ఉన్నాయి.

16 నుంచి టెన్త్ ఇన్‌స్టంట్ పరీక్షల దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, మే 12: పదవ తరగతి ఇన్‌స్టంట్ పరీక్షలు రాసేందుకు ఈ నెల 16 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 2 నుంచి 8వ తేది వరకు పరీక్షలు జరుగనున్నాయి. ప్రైవేటు అభ్యర్థులు మినహా ఇతర విద్యార్థులు తాము చదివిన పాఠశాలల్లో ఈ నెల 16 నుంచి జూన్ 1వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత కలిగిన ప్రైవేటు అభ్యర్థులు, ఇప్పటికే పరీక్షల్లో ఫెయిలైన అభ్యర్థులు, సేవా కేంద్రాల ద్వారా దరఖస్తు చేసుకోవాలి. సైన్స్ ప్రాక్టికల్స్ శిక్షణా తరగతుల్లో చేరేందుకు ఈ నెల 16 నుంచి 24వ తేది వరకు జిల్లా విద్యాధికారి కార్యాలయాలకు వెళ్లి, రూ.125 చెల్లించి పేరు నమోదుచేసుకొని రసీదు పొందాల్సి ఉంది. ఈ రసీదు ఉన్నవారినే శిక్షణా తరగతులకు అనుమతించనున్నారు. నిర్ణీత గడువులో దరఖాస్తు సమర్పించని వారు, ఫైన్ రూ.500 చెల్లించి జూన్ 3,4 తేదీల్లో ఆన్‌లైన్‌లో తత్కాల్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక అనుమతి రుసుము లేదు. తమిళం, ఆంగ్లం, గణితం, సైన్స్, ఐచ్ఛిక పాఠ్యాంశం, సోషల్ సైన్స్ పరీక్షలు వరుసగా జూలై 2,3,4,5,6,8 తేదీల్లో జరుగనున్నారు. వివరాలకు www.dge.tn.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ప్రభుత్వ పరీక్ష శాఖ ఒక ప్రకటనలో తెలియజేసింది.

మెట్రో రైల్ సిబ్బందిపై దాడి చేసిన గేయరచయిత

అడయార్, మే 12: మెట్రో రైల్ నిర్మాణ పనుల్లో నిమగ్నన సిబ్బందిపై సినీ గేయరచయిత వేల్‌మురుగన్ భౌతికదాడికి తెగబడ్డారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు విరుగంబాక్కం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. గేయరచయిత వేల్ మురుగన్ తన కుటుంబ సభ్యులతో కలిసి మదురవాయిల్ ప్రాంతంలో ఉంటున్నారు. ఈయన శనివారం రాతి 11 గంటల సమయంలో తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో విరుగంబాక్కం వేంబులి అమ్మన్ ఆలయం మీదుగా ఆర్కాట్ రోడ్డు వెళ్తున్నారు. అయితే, ఈ ప్రాంతంలో మెట్రో రైల్ నిర్మాణ పనులు జరుగుతున్న కారణంగా ఆ రహదారిని వన్‌వేగా మార్చారు. అయితే, వేల్‌మురుగన్ మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా, రోడ్డుకు అడ్డంగా ఉంచి బారికేడ్లను తొలగించి ముందుకు వెళ్లారు. నిర్మాణ పనులను పర్యవేక్షించే మేనేజర్ వడివేలు గమనించి, ఇది వన్‌వే, వాహనాలు వెళ్లేందుకు అనుమతి లేదని చెప్పాడు. దీంతో వేల్‌మురుగన్ ఆగ్రహించిన వడివేలుతో వాగ్వాదానికి దిగడమే కాకుండా, అతనిపై దాడిచేశాడు. ఈ దాడిలో గాయపడిన వడివేలును ఇతర సిబ్బంది సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్సఅందించారు.ఆతర్వాత బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

పెరంబూర్, మే 12: అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో నిర్వహించారు. 'లేడి విత్ ది లాంప్'గా పేరొందిన ఫ్లోరెన్స్ నైటింగేల్ చేసిన సేవలకు గుర్తుగా ప్రతి ఏడాది మే 12వ తేది అంతర్జాతీయ నర్సుల దినోత్సవం నిర్వహిస్తుంటారు. సేలం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రాంగణంలోని 'నైటింగేల్' విగ్రహానికి నర్సులు పూలమాలవేసి, కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. తంజావూరు ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న నర్సులు, వైద్యులు నైటింగేల్ చిత్రపటం ముందు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కన్నియాకుమారి జిల్లా అచారిపల్లంలోని ప్రభుత్వ వైద్యకళాశాల నర్సులకు వైద్యులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరి ఇందిరాగాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిర్వహించిన వేడుకల్లో ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి వైద్యులు, నర్సులు, సిబ్బంది నివాళులర్పించారు. అలాగే, రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిర్వహించిన వేడుకల్లో వైద్యులు, నర్సులు నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పించారు.



సేలం ప్రభుత్వ వైద్యకళాశాల ప్రాంగణంలో 'నైటింగేల్' విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైద్యులు, నర్సులు

ప్రజలతో చులకనగా మాట్లాడొద్దు

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సూచన

పెరంబూర్, మే 12: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వచ్చిన ప్రజలతో చులకనగా మాట్లాడొద్దని రాష్ట్రప్రభుత్వం సూచించింది. ఈ మేరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు పంపింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రిజిస్ట్రేషన్‌కు వచ్చే ప్రజలకు తగిన సూచనలు, సలహాలివ్వాలి. రిజిస్ట్రేషన్ దరఖాస్తులో వివరాలు, ఇతర అంశాల్లో ప్రజలు చిన్న చిన్న లోపాలుంటే వారిపై కార్యాలయాల అధికారులు, సిబ్బంది విసుక్కోవడంతో పాటు చులకనగా మాట్లాడుతున్నారనే ఫిర్యాదులందాయి. అలా, చిన్న తప్పులు దొర్లితే వారిని తిప్పి వెనక్కి పంపకుండా అధికారులు సవరించాలని రిజిస్ట్రేషన్ శాఖ సర్క్యులర్‌లో సూచించింది.

మెట్రో రైల్వేస్టేషన్లలో మరో 40 ఎస్కలేటర్లు

పెరంబూర్, మే 12: మెట్రో రైల్వేస్టేషన్లలో అదనంగా 40 ఎస్కలేటర్ల ఏర్పాటు చేస్తున్నారు. మరో ఆరు నెలల్లో పనులు పూర్తిచేయనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది. నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో ప్రయాణిస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రద్దీగా ఉన్న స్టేషన్లలో అదనపు ఎస్కలేటర్లు, లిఫ్టులు ఏర్పాటు చేయాలని సీఎంఆర్ఎల్ నిర్ణయించింది. ఆ ప్రకారం, ఎగ్మూర్, తిరుమంగళం, అన్నానగర్, ఆలందూర్, కోయంబేడు, డీఎంఎస్, థౌజండ్ లైట్స్ తదితర 10 మెట్రో రైల్వేస్టేషన్‌లలో అదనంగా 40 ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నామని, మరో ఆరు నెలల్లో ఇవి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

మళ్లీ వాయిదా పడిన శ్రీలంక నౌకాయానం

పెరంబూర్, మే 12: ప్రయాణికుల నౌక నాగపట్టణానికి ఆలస్యంగా రావడంతో శ్రీలంక నౌకాయానం మరోమారు వాయిదాపడింది. నాగపట్టణం నుంచి శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు గత ఏడాది అక్టోబరు 14వ తేది నుంచి ప్రయాణికుల నౌకాయానం ప్రారంభమైంది. కేరళ రాష్ట్రం కొచ్చిన్ నుంచి 'సెరిపాని' అనే పేరుతో ప్రయాణికుల నౌకా సేవలు ప్రారంభించారు. అనంతరం ఈశాన్య రుతుపవనాల కారణంగా అక్టోబరు 23 నుంచి నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, ఈ సేవలు మళ్లీ అందుబాటులోకి రానున్నాయని వార్తలు వెలువడ్డాయి. అదే సమయంలో 'సెరిపాని' నౌకకు బదులుగా 'శివగంగై' అనే నౌక నడుపనున్నట్లు ప్రకటించారు. తిరుచ్చి కేంద్రంగా పనిచేస్తున్న శుభం గ్రూప్ ఆఫ్ కంపెనీ, ఇంట్ శ్రీబ్రే సర్వీస్ సంస్థల సంయుక్తంగా సోమవారం నుంచి 'శివగంగై' ప్రయాణికుల నౌకా సేవలు ప్రారంభమవుతున్నట్లు, అందుకోసం ఆదివారం నాగపట్టణం-కాంగేశన్ మధ్య నౌక ట్రయల్ రన్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, నాగపట్టణానికి నౌక రావడం జాప్యం జరగడంతో నౌకా సేవలు ఈ నెల 17 నుంచి ప్రారంభమవుతాయని ప్రకటించారు.. ఇప్పటికే రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులు తమ ప్రయాణాన్ని మరో రోజుకు మార్చుకోవాలని, వద్దనుకొనే వారు రుసుము వాపసు తీసుకోవాలని అధికారులు తెలిపారు.

భగ్గుమంటున్న ఎండలు...

ఎంటీసీలో డ్రైవర్లకు ఫ్యాన్ సదుపాయం

పెరంబూర్, మే 12: బస్సుల్లో డ్రైవర్ల సీటు పై భాగంలో ఫ్యాను ఏర్పాటుచేయాలని మెట్రోపాటిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) నిర్ణయించింది. రాష్ట్రంలో అగ్ని నక్షత్రం ప్రారంభమైనప్పటి నుంచి రోజురోజుకు ఎండ తీవ్రత అధికమవుతోంది. ముఖ్యంగా, రాజధాని నగరం చెన్నైలో పగటి వేళ ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయపడేలా ఎంత తీవ్రత ఉంటోంది. ఈ క్రమంలో, ఎండ తీవ్రత నుంచి డ్రైవర్‌కు ఉపశమనం పొందేలా ఫ్యాన్ ఏర్పాటుచేయాలని ఎంటీసీ నిర్ణయించింది. డ్రైవర్ సీటు సమీపం, పై భాగంలో బ్యాటరీతో నడిచే ఫ్యాన్ ఏర్పాటుచేయనున్నారు. తొలివిడతగా 1,000 బస్సుల్లో బ్యాటరీతో పనిచేసే ఫ్యాన్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించి ప్రస్తుతం 250 బస్సుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేసినట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

వైభవంగా శంకర జయంతి వేడుకలు

వేలూరు, మే 12: బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శంకర జయంతి, రామానుజ జయంతి వేడుకలు నిర్వహించారు. సత్తువాచ్చేరిలో జరిగిన వేడుకలకు వేలూరు బ్రాహ్మణ శాఖ అధ్యక్షుడు రాజ అధ్యక్షత వహించగా, మహిళా శాఖ జాయింట్ సెక్రటరీ మాలతి ఆహ్వానం పలికారు. మహిళా శాఖ సభ్యురాలు రాజేశ్వరి ప్రార్థన చేశారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వర పూజ, సంకల్పం, ఉపచార పూజ, అలంకారం, అర్చన, ధ్యానం, శంకర పాద పూజ, అష్టోత్తర నామావళి, భజన, మహా దీపారాధనలు, హారతి తదితరాలు నిర్వహించారు.


వేడుకల్లో పాల్గొన్న సంఘ సభ్యులు

అరియూర్‌లో గజ్జె పూజ

వేలూరు, మే 12: స్థానిక అరియూర్ వసంతమ్ నగర్ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఆదివారం నాట్యాంజలి శిష్యబృందం గజ్జెల పూజ నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా వేలూరు శ్రీపురం నారాయణి పాఠశాల, శ్రీ పురం స్వర్ణాలయ ట్రస్టీ, డైరెక్టర్ డా.సురేష్‌బాబు, షిర్డీసాయిబాబా ఆలయ నిర్వాహకులు డా.జి.కోదండన్ (రిటైర్డ్ డీఎస్పీ), చెన్నై శ్రీపెరుంబుదూర్ గ్లోబల్ ఎలక్ట్రికల్ టెక్నాలజీ ఫౌండేషన్ నిర్వాహకులు సుధాకర్ తదితరులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా గజ్జెల పూజలో పాల్గొన్న జనప్రియ, కావ్య, గోద్రై, మధురికా, తనిష్క, కావ్య, యాషికా, సహానాశ్రీలను అతిథులు, నిర్వాహకులు అభినందించారు. కార్యక్రమంలో గురు నాట్య కళా విభూషణ్ శివ దైవలక్ష్మి, సతీష్‌కుమార్, అరియూర్ గ్రామ పెద్ద శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కళాకారులతో అతిథులు, నిర్వాహకులు

ఉత్సవమూర్తి విహారానికి సిద్ధమవుతున్న రథం

పెరంబూర్, మే 12: కాంచీపురం వరదరాజ పెరుమాళ్ ఆలయ వైకాశి బ్రహ్మోత్సవాలు ఈనెల 20వ తేది ధ్వజారోహణంతో ప్రారంభం కానున్నాయి. ఉదయం, సాయంత్రం వివిధ వాహనాల్లో ఉత్సవమూర్తి విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. వేడుకల్లో ఏడో రోజైన 26వ తేది ఉదయం 6 గంటకు రథోత్సవం జరుగనుంది. అందుకోసం రథాన్ని బయటకు తీసుకొచ్చి, శుభ్రం చేశారు. అనంతరం రథాన్ని పూలు, తోరణాలు, విద్యుద్దీపాలతో అలంకరించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.


నీటితో రథాన్ని శుభ్రం చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అన్నాడీఎంకే ఆధ్వర్యంలో అన్నదానం

వేలూరు, మే 12: గుడియాత్తం కొత్త బస్టాండ్ సమీపంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి 70వ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాము, జిల్లా ఉపాధ్యక్షుడు కస్తూ మూర్తి, నగర మండ్ర అధ్యక్షుడు పూంగోడి మూర్తి, యూనియన్ సెక్రటరీ శివ, నగర అవై అధ్యక్షుడు ఆర్కే అన్బు, నగర ఉప సెక్రటరీ రవిచంద్రన్, జిల్లా ప్రతినిధి దేవరాజ్, నగర జాయింట్ సెక్రటరీ అముద కరుణ, సభ్యులు చిట్టిబాబు, దండపాణి, లావణ్య, రామమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుమారు 5,000 మందికి అన్నదానం చేశారు.


అన్నదానం చేస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు

24 గంటల్లో దొంగలను పట్టుకున్న పోలీసులు

వేలూరు, మే 12: స్థానిక కాట్పాడిలో చోరీలకు పాల్పడిన అగంతకులను పోలీసులు 24 గంటల్లో అరెస్ట్ చేశారు. సేనూరు ప్రాంతానికి సౌందరరాజన్ ఇంట్లో ఈ నెల 8వ తేది ప్రవేశించిన అగంతకులు బీరువా పగులగొట్టి 20 సవర్ల నగలు దోపిడీ చేసారు. ఈ ఘటనపై విరుదంబట్టు పోలీసులు విచారణ చేపట్టి, చోరీకి పాల్పడిన సేనూరు కోట్టైత్తమ్మన్ ఆలయ వీధికి చెందిన శంకర్ (19), తిరుమణి మెయిన్ రోడ్డుకు చెందిన అవినేసి (19), హరీష్‌లను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి వేలూరు జైలుకు తరలించారు. ఫిర్యాదు చేసిన 24 గంటల్లో చోరీకి పాల్పడిన వారిని అరెస్ట్ చేసిన కాట్పాడి డీఎస్పీ శరవణన్, సీఐ తమిళ్‌సెల్వన్, ఎస్‌ఐ కార్తీక్, కానిస్టేబుళ్లు మణికంఠన్, సెందిల్, రామమూర్తి, ప్రత్యేక పోలీసులను జిల్లా ఎస్పీ మణివన్నన్ అభినందించారు.


నిందితులతో పోలీసులు

పిల్లల టిక్కెట్లపై అప్రమత్తంగా ఉండాలి

వేళచ్చేరి, మే 12: ప్రభుత్వ బస్సుల్లో పిల్లలకు వసూలు చేస్తున్న అర టిక్కెట్టుపై అప్రమత్తంగా వ్యవహరించాలని రవాణా శాఖ సూచించింది. ఈ మేరకు ఆ శాఖ విడుదల చేసిన ప్రకటనలో... ఐదేళ్లలోపున్న పిల్లలు ప్రభుత్వ బస్సుల్లో ఉచితంగా, 5 నుంచి 12 ఏళ్లలోపున్న పిల్లలకు ఆఫ్ టిక్కెట్టు వసూలుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, పిల్లల వయస్సు గుర్తించడంలో ఇబ్బందులు పడుతున్న కండక్టర్లు, ఐదేళ్లలోపున్న పిల్లల నుంచి కూడా అర టిక్కెట్టు వసూలుచేస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన రవాణా శాఖ... అనుమానంగా ఉన్న పిల్లల బర్త్ సర్టిఫికెట్, ఆధార్ పరిశీలించాలన్నారు. అదే సమయంలో 2020 జూన్ 1వ తేది అనంతరం జన్మించిన పిల్లలకు ఛార్జీ వసూలుచేయాల్సిన అవసరం లేదని రవాణా శాఖ పేర్కొంది.

ఘనంగా పిల్లల సంరక్షణా కేంద్రం వార్షికోత్సవం

ఐసిఎఫ్, మే 12: 'ఆల్ ది చిల్డ్రన్ ప్రత్యేక పిల్లల కేంద్రం' 8వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా న్యాయమూర్తి ఏడీ జగదీష్ చంద్ర, సమాజసేవకుడు దీపక్ నాదన్‌లు పాల్గొన్నారు. వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.


పిల్లలతో అతిథులు, నిర్వాహకులు

రెండు బస్సుల ఢీ : 29 మందికి గాయాలు

అడయార్, మే 12: కడలూరు జిల్లా రెడ్డిచావడి కరికాల్ నగర్ ప్రాంతంలో శనివారం రాత్రి ప్రభుత్వ, ప్రైవేటు బస్సులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 29 మంది ప్రయాణికులు గాయపడ్డారు. చెన్నై నుంచి కారైక్కాల్ వెళ్లిన ప్రభుత్వ రవాణా సంస్థ బస్సును వెనుక నుంచి వచ్చిన ప్రైవేటు బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లోని ప్రయాణికుల్లో 29 మంది గాయపడగా వీరిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా కడలూరు - పుదుచ్చేరి రహదారిలో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైంది.

జీసీసీ కమిషనర్ పేరిట మోసం

పెరంబూర్, మే 12: తన పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ప్రారంభించి స్నేహితులను నగదు అడుగుతూ మోసం చేస్తున్నారని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ కమిషనర్ డా.జె.రాధాకృష్ణన్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన స్నేహితులకు ఫోన్ చేసి నగదు అడుగుతూ మోసం చేస్తున్నట్లు తెలిసిందని, వారు ఆ నెంబరుకు ఫోన్ చేయగా వేరే రాష్ట్రానికి చెందిన వారుగా తెలిసిందని జీసీసీ కమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై సైబర్ క్రైం పోలీసులు విచారణ చేపట్టారు.

ఆరుబయట నిద్రపోతున్న వారిపైకి కారు

- నలుగురు మహిళల సహా ఏడుగురికి గాయాలు

పెరంబూర్, మే 12: ఆరుబయట నిద్రిస్తున్న వారిపై కారు దూసుకెళ్లిన ఘటనలో పలువురికి తీవ్రగాయాలైన ఘటన అశోక్‌నగర్‌లో ఆదివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. అశోక్‌నగర్ 10వ వీధికి చెందిన మారియప్పన్ ఇంటి శుభకార్యక్రమంలో పాల్గొనేందుకు బంధువులు వచ్చారు. ఇంట్లో తగినంత స్థలం లేకపోవడంతో శనివారం రాత్రి ఇంటి ముందు భాగంలో మారియప్పన్ భార్య సరిత, బంధువులు ధనలక్ష్మి, అవ్వ జ్యోతి, గౌతమ్ నిషా సహా పలువురు చాప వేసుకొని నిద్రపోయారు.. ఆదివారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో అటువైపు వచ్చిన కారు పడుకున్న వారిపై దూసుకెళ్లింది. దీంతో నలుగురు మహిళల సహా ఏడుగురి కాళ్లకు గాయాలయ్యాయి. వారి కేకలకు అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు 108 అంబులెన్స్‌లో రాయపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో సరిత, తిల్లై నాయకి తదితరుల కాళ్లు విరిగాయి. సమాచారం అందుకున్న గిండి ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఈ ప్రమాదానికి కారణమైన కారు నడిపిన వ్యక్తి మహారాష్ట్ర రాష్ట్రానికి చెందిన వైశాలి పాటిల్ అని, నగరంలోని బంధువుల ఇంటికి వచ్చిన ఆమె ఆదివారం ఉదయం గూగుల్ మ్యాప్ ద్వారా కారు నడిపినట్లు తెలిసింది. ఈ ఘటనపై మూడు సెక్షన్ల కింద కేసు నమోదుచేసిన పోలీసులు వైశాలి పాటిల్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.



నిద్రిస్తున్న వారిపై దూసుకెళ్లిన కారు - ప్రమాదానికి కారణమైన ఉత్తరాది మహిళ (ఇన్‌సెట్‌లో)

ఘనంగా ఈపీఎస్ బర్త్‌డే

- పేద రైతు కుటుంబాలకు పాడి పశువుల వితరణ

ప్యారీస్, మే 12: అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి 70వ పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. ఈపీఎస్ ముఖ్య అనుచరుల్లో ఒకరైన ఆ పార్టీ అనుబంధ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డా.వి.సునీల్ నేతృత్వంలో టి.నగర్‌లో కేక్ కట్ చేసి ఈపీఎస్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా తిరువళ్లూర్, చెంగల్పట్టు, కళ్లకుర్చి తదితర జిల్లాలకు చెందిన ఏడు రైతు కుటుంబాలకు పాడిపశువులను లేగదూడలతో సహా అందజేశారు. పార్టీ నిర్వాహకులు సరస్వతి రంగస్వామి, పద్మిని సుందరం, వి.హరిబాబు, ఎస్.సురేష్‌కుమార్, కె.సూర్యకళ, కె.తేన్‌మొళి, పి.పద్మనాభన్, వి.సురేష్‌కుమార్, సి.ప్రభాకరన్, కరాటే శేఖర్, ఊమతురై, తమిళరసు, మహేంద్రన్, ప్రభ, మాంబళం జయపాల్, రాయల్ వెంకటేశ్, ఎస్.జయరామన్, ఎం.లోకనాథన్ తదితరులు పాల్గొన్నారు.


రైతులకు పాడిపశువులను అందజేస్తున్న డా.సునీల్

హెచ్ఐటీఎస్‌లో 'వాలీబాల్ కోచింగ్' కోర్సు

అడయార్, మే 12: హిందుస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (హెచ్ఐటీఎస్)లో వాలీబాల్ కోచింగ్ కోర్సు ప్రారంభించనున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో 'స్పోర్ట్స్ కోచింగ్ ఇన్ వాలీబాల్' పేరుతో ఈ కోర్సు ప్రారంభిస్తారు. ఈ కోర్సు శిక్షణ ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించి జూలై 8వ తేదీతో పూర్తవుతుంది. ఇందులో విద్యార్థినీ విద్యార్థులు చేరవచ్చు. పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, విభాగాలు, అకడెమీస్, క్లబ్స్, ఇండస్ట్రియల్ హౌసెస్, ఏజెన్సీస్ అసోసియేట్స్‌కు ఈ శిక్షణ అదనపు బలంగా పరిగణించవచ్చు. వాలీబాల్‌లో నిష్ణాతులైన కోచ్‌లతో కాంప్రెహెన్సివ్ ట్రైనింగ్, ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో ఈ శిక్షణ ఇస్తారు. ఆటలోని మెళకువలు, ఆటగాళ్ళ వ్యూహ ప్రతివ్యూహాల మెరుగుదల వంటి అంశాలపై ప్రధానంగా దృష్టిసారిస్తారు. అంతేకాకుండా, జాతీయ వాలీబాల్ జట్టు మాజీ కోచ్ డాక్టర్ హెచ్‌డి. కృష్ణప్ప, డాక్టర్ ఎం.హెచ్. కుమార, శ్రీధరన్ వంటి నిష్ణాతులతో ప్రత్యేక ఉపన్యాసాలు కూడా ఉంటాయి. ఆరు వారాలపాటు సాగే ఈ శిక్షణలో బేసిక్, అడ్వాన్స్ లెవల్-1, 2లపై శిక్షణ ఇస్తారు. ఈ ఆరువారాల సర్టిఫికెట్ కోర్సు పూర్తి వివరాలకు హిట్స్ క్రీడా విభాగం డీన్, కోర్సు డైరెక్టర్ డాక్టర్ జె.డేవిడ్ మ్యాథ్యూలను 97465 66592 అనే నంబరులో సంప్రదించవచ్చు.

స్కూటర్‌లోని రూ.2.25 లక్షల చోరీ

అడయార్, మే 12: స్థానిక పెరంబూరు, పులియంతోపు ప్రాంతంలోని కబేళాల మార్కెట్‌లో ఓ వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనంలోని రూ.2.25 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తులు చేశారు. ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, సెవెన్ వెల్స్ ప్రాంతానికి చెందిన అక్బర్ బాషా ఆదివారం ఉదయం మాంసం కొనుగోలు చేసేందుకు ఈ మార్కెట్‌కు వెళ్లారు. ఆయన తన వెంట రూ.2.25 లక్షల నగదు కూడా తీసుకెళ్లారు. ఈ మొత్తాన్ని ద్విచక్రవాహన బాక్సులో పెట్టారు. మార్కెట్ బయట ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి, మాంసం కోసం మార్కెట్‌కు వెళ్లి కొద్ది సేపటికి వచ్చాడు. అప్పటికే ద్విచక్రవాహనానికి ఉన్న బాక్సు మూత తెరిచి గుర్తు తెలియని వ్యక్తులు అందులోని డబ్బు చోరీ చేసి జారుకున్నారు. అక్బర్ బాషా తిరిగొచ్చి చూడగా, ద్విచక్రవాహనంలో డబ్బు కనిపించకపోవడంతో బోరున విలపిస్తూ, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

మద్యం మత్తులో మహిళపై హత్యాచారం

- కేసులో నిందితుల వాంగ్మూలం

అడయార్, మే 12: తిరువళ్ళూరు జిల్లా గుమ్మిడిపూండి సమీపంలో ఒక మహిళపై అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని విచారించగా దుకాణంలో మద్యం సేవించి, ఒంటరిగా వెళుతున్న మహిళను కిడ్నాప్ చేసి, బెదిరించి నగ్నంగా చేసి సామూహిక అత్యాచారం చేసిన తర్వాత హత్య చేసినట్టు అంగీకరించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు సూర్య (25) కాగా, ఇతని స్నేహితులు సురేందర్ (22), జెపరాజ్ (21)లు కలిసి ఈ దారుణానికి పాల్పడినట్లు తేలింది. దీంతో వీరిని పోలీసులు అరెస్టు చేసి హత్య జరిగిన తీరుపై వాంగ్మూలం తీసుకున్నారు. అయితే హత్యకు గురైన మృతురాలు ఎవర్నదానిపై పోలీసులు ఎలాంటి ఆధారం లభించడం లేదు. ఆమె ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.

అన్నామలైపై కేసు నమోదుకు ప్రభుత్వం అనుమతి

ఐసిఎఫ్, మే 12: సమాజసేవకుడు పీయూష్ ఫిర్యాదు నేపథ్యంలో, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై కేసు నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది.. సేలంకు చెందిన పీయూష్ సేలం జేఎం4 మేజిస్ట్రేట్ కోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఇరు వర్గాలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆస్తికులు, నాస్తికులంటూ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని, ఆయనపై చర్యలు చేపట్టేలా ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారించిన మేజిస్ట్రేట్ యువరాజ్ రెండు వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా అన్నామలై ప్రసంగించారనే సెక్షన్ల కింద కేసు నమోదు చేసినందువల్ల, ప్రభుత్వ అనుమతి పొందాలని ఆదేశించారు. ఈ కేసులో అన్నామలైపై కేసు నమోదుకు అనుమతిస్తూ రాష్ట్ర కార్యదర్శి నందకుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల నకలును సేలం జేఎం కోర్టుకు అందజేశారు. ఈ కేసు మరో రెండు రోజుల్లో విచారణకు వచ్చే అవకాశముందని, అప్పుడు అన్నామలై సమన్లు జారీచేసి విచారించే అవకాశముందని కోర్టు వర్గాల సమాచారం.

మత్తు మాత్రలు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఐసిఎఫ్, మే 12: స్థానిక ఓటేరి సమీపంలో మత్తు మాత్రలు విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఓటేరి, పులియాంతోపు, బేసిన్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో మత్తు కోసం నొప్పి నివారణ మాత్రల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఓటేరి ఇన్‌స్పెక్టర్ రమేష్ నేతృత్వంలో పోలీసులు శనివారం రాత్రి ఓటేరి చంద్రయోగి సమాధి వీధిలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 8 మత్తు మాత్రలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో.. అతను పులియాంతోపు కనకరాయన్ గార్డెన్ ప్రాంతానికి చెందిన విక్కీ అలియాస్ శంకర్ (21) అని, నమ్మాళ్వార్‌పేటకు చెందిన మాధవన్ నుంచి మత్తు మాత్రలు పొంది విక్రయిస్తున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో శంకర్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు, మాధవన్ కోసం గాలిస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ఐసిఎఫ్, మే 12: స్థానిక కొళత్తూర్‌లో విద్యుదాఘాతానికి యువకుడు మృతిచెందాడు. కొళత్తూర్ తిరుపతి నగర్‌కు చెందిన రాజన్, తన ఇల్లు శుభ్రం చేసేందుకు ఓ ప్రైవేటు సంస్థ ద్వారా ఉద్యోగులను రప్పించారు. ఈ పనుల కోసం పుళల్ కావాంగరైలోని శ్రీలంక శరణార్థుల శిబిరంలో ఉంటున్న సిరోధంర్‌రాజ్ (29), ఆయన బంధువు సనూజన్ (18), సూర్య (25) శనివారం మధ్యాహ్నం రాజన్ ఇంటికి చేరుకున్నారు. టాయిలెట్ శుభ్రం చేస్తున్న సనూజన్, ఆ ప్రాంతంలోని విద్యుత్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై స్పృహతప్పి పడిపోయాడు. అతడిని గమనించిన ఇంటి యజమాని రాజన్ వెంటనే తనకారులో సమీపంలోని ప్రైవేటుఆస్పత్రికి సనూజన్‌ను తీసుకెళ్లగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై కొళత్తూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

హత్యకేసులో ఆరుగురి అరెస్ట్

ఐసిఎఫ్, మే 12: స్థానిక మాంగాడులో కార్మికుడి హత్యకేసులో ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. మాంగాడు చిన్నమనచేరి ప్రాంతానికి చెందిన యువరాజ్ (35) తిరుపెరుంబుదూర్‌లోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి యువరాజ్ మద్యం మత్తులో తోపూర్ ప్రాంతంలోని రోడ్డు పక్కన పడుకున్నాడు. ఆ సమయంలో తోపూర్‌కు చెందిన గణేష్, యువరాజ్ మధ్య వాగ్వివాదం జరిగినట్టు సమాచారం. ఈ వాగ్వివాదం ఘర్షణకు దారితీసి గణేష్ బండరాయితో యువరాజ్‌పై దాడిచేశారు. అదే సమయంలో గణేష్ స్నేహితులు కూడా యువరాజ్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో యువరాజ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన మాంగాడు పోలీసులు విచారణ చేపట్టి, గణేష్, అతని స్నేహితులు దినేష్‌కోఠి, చరణ్‌రాజ్, ప్రవీణ్‌కుమార్, వసంత్, సిలంబరసన్ తదితర ఆరుగురిని అరెస్ట్ చేసి తిరుపెరుంబుదూర్ కోర్టులు హాజరుపరచి జైలుకు తరలించారు.

పిచ్చికుక్క దాడిలో 15 మందికి గాయాలు

ఐసిఎఫ్, మే 12: తేని జిల్లా కడమలైగుండు ప్రాంతంలో పిచ్చికుక్క దాడిలో మహిళలు, చిన్నారులు అని 15 మందికి గాయాలయ్యాయి. ఆదివారం ఉదయం రోడ్డుపై వెళుతున్న వారిపై ఈ కుక్క దాడి చేసింది. గాయపడిన వారిని ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు.



'హరా' ఆడియో రిలీజ్‌లో భాగ్యరాజ్, మోహన్ తదితరులు

ప్రేక్షకులే మాకు దేవుళ్ళు

- నటుడు భాగ్యరాజ్
- 7న మోహన్ 'హరా' రిలీజ్

మోహన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'హరా' జూన్ 7వ తేదీ విడుదలకానుంది. దీనిని పురస్కరించుకుని ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. కోయంబత్తూరు ఎస్‌పీ మోహన్‌రాజ్, జీ మీడియా జయ శ్రీ విజయ్ సంయుక్తంగా నిర్మించగా, విజయ్ శ్రీ జి దర్శకత్వం వహించారు. ఈ ఆడియో రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ నటుడు భాగ్యరాజ్ మాట్లాడుతూ, 'మోహన్‌కు, నాకు ప్రేక్షకులే దేవుళ్ళు. వారి ఆశీర్వాదాల వల్లే ఈ స్థాయిలో ఉన్నాం. మోహన్ గురించి తెలియని ఒక విషయం ఉంది. చిత్రపరిశ్రమకు చెందినవారికి కొన్ని అలవాట్లున్నాయి. కానీ, వాటికి దూరంగా మోహన్ ఉంటాడు. అందుకే ఇప్పటికీ ఎంతో ఫిట్‌గా ఉన్నారు. ఆయన చిత్రాల్లో పాటలే బలం. ఇళయరాజా నుంచి టీఆర్ సంగీతంలో వచ్చిన అనేక పాటలు సూపర్ హిట్. మోహన్ నటించే టుడు అతనే పాటను పాడుతున్నట్టుగా ఉంటుంది. అది అతని ప్రత్యేకత. ఈ లక్షణాన్ని నడిగర్ తిలగం శివాజీ గణేశన్‌లో చూశాను. దర్శకుడు విజయ్ శ్రీ జి విభిన్నమైన చిత్రాలు చేస్తూ తానేంటో నిరూపించుకున్నాడు. ఈ చిత్రం మోహన్‌కు మరో సక్సెస్‌ఫుల్ మూవీగా నిలుస్తుంది' అన్నారు. హీరో మోహన్ మాట్లాడుతూ, 'అభిమానులకు ఎన్నటికీ రుణపడివుంటాను. తాను నటించకపోయినా ఇప్పటికీ అభిమానిస్తూనే ఉన్నారు. ఈ స్టోరీని కూడా ఏడు సార్లు ఎడిట్ చేసిన తర్వాతే నటించేందుకు అంగీకరించాను. చిత్ర నిర్మాణంలో కోయంబత్తూరు వాసులు అందించిన సహకారం మరువలేనిది. సంగీత దర్శకుడు రషాంత్ అర్విన్ అద్భుతమైన సంగీతం అందించారు. జూన్ 7న విడుదల చేస్తున్నాం. ఎప్పటిలానే మీరు ఆదరించాలి' అని కోరారు. దర్శకుడు విజయ్ శ్రీ మాట్లాడుతూ, 'మోహన్ అభిమానులనే కాకుండా ప్రతి ఒక్కరికీ మెచ్చే చిత్రంగా రూపొందించాను' అని పేర్కొన్నారు. ఇందులో అనుమోల్, అనిత్రా నాయర్, యోగిబాబు, చారు హాసన్, సురేష్ మీనన్, వనితా విజయకుమార్, మొట్టై రాజేంద్రన్, సింగంపులి తదితరులు నటించారు.

చిత్రజ్యోతి



నయనతార

అక్క పాత్రకు అంత రెమ్యునరేషనా?

ఇటీవల కాలంలో అగ్రహీరోయిన్ నయనతార హీరోల సరసన కథానాయికగా నటించే చిత్రాల కంటే హీరోయిన్ ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటించేందుకు అధిక ఆసక్తి చూపుతోంది. అదేసమయంలో అగ్రహీరోలతో మాత్రం ఒకటి రెండు చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెకు అక్కపాత్రలు కూడా ఉన్నాయి. ఈ పాత్రల్లో నటించేందుకు ఆమె అంగీకరిస్తున్నప్పటికీ రెమ్యునరేషన్ విషయంలో మాత్రం ఏమాత్రం వెనక్కి తగ్గడం లేదు. నయనతార ప్రధాన పాత్రలో నటించిన 'మన్నాంగట్టి సిన్స్ 1960' అనే చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తి చేసుకుంది. ఈ సినిమా తర్వాత నవీన్ పాలితో కలిసి 'డియర్ స్టూడెంట్స్' అనే చిత్రంలో నటిస్తున్నారు. అలాగే, ఓ కన్నడ మూవీలో కూడా ఆమె నటిస్తున్నారు. ఇందులో అక్క పాత్రను ఆమె పోషిస్తున్నారు. అయినప్పటికీ తన రెమ్యునరేషన్ తగ్గించుకునేందుకు ససేమిరా అన్నారట. పైగా తాను తీసుకునే పారితోషికం కంటే అధికంగానే రెమ్యునరేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారట.

స్థానిక ఎన్నికల నేపథ్యంలో విజయకుమార్ 'ఎలక్షన్'

- 17న రిలీజ్



'ఎలక్షన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిత్ర బృందం

స్థానిక ఎన్నికల రాజకీయాల నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం 'ఎలక్షన్'. విజయ్ కుమార్ హీరోగా రీల్ గుడ్ ఫిలిమ్స్ పతాకంపై నిర్మాత ఆదిత్య నిర్మించగా, తమిళ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఈ నెల 17వ తేదీ శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీ అధినేత శక్తివేలన్ విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ శనివారం నగరంలో జరిగింది. హీరో విజయ్‌కుమార్ మాట్లాడుతూ, 'స్థానిక ఎన్నికలు, క్షేత్రస్థాయి రాజకీయాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఇది రాజకీయ చిత్రమైనప్పటికీ... రాజకీయాలను దైనందిన జీవితంలో భాగం చేస్తూ, మానవ సంబంధాలకు ప్రాధాన్యత ఇచ్చేలా, ఫ్యామిలీ డ్రామా మూవీగా దర్శకుడు తెరకెక్కించారు. ఈ సినిమాకు వెన్నుకగా చెప్పాలంటూ కథతో పాటు జార్జ్ మరియన్ పోషించిన పాత్ర. దర్శకుడు తమిళ్‌తో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. నిర్మాత ఆదిత్యతో ఇది నా రెండో చిత్రం. సందర్భంగా ఇందులో నటించిన ప్రతి ఒక్క నటీనటుడికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. దర్శకుడు తమిళ్ మాట్లాడుతూ, 'పేరు ప్రఖ్యాతల కోసం నేను సినిమాల్లోకి రాలేదు. జీవితంలో ఎదురైన విషాదకర ఘటనలు, నన్ను ఆలోచింపజేసిన విషయాలను చెప్పడానికి వచ్చాను. నేను దర్శకత్వం వహించిన 'సేతుమాన్' చిత్రాన్ని ఆదరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు, 'సేతుమాన్' చిత్రం ప్రేక్షలకు సులభంగా కనెక్ట్ అయింది. అయితే, ఈ సినిమా అంత తొందరగా కనెక్ట్ అవుతుందా లేదా అన్నది కాస్త భయంగా ఉంది. 'సేతుమాన్' చిత్రం తర్వాత పెద్ద నిర్మాణ సంస్థల్లో సినిమా చేయాలని ఎంతగానో ప్రయత్నించాను. కానీ అవకాశం లభించలేదు. చివరకు విజయకుమార్‌తో కలిసి ఈ సినిమా రూపొందించాను. ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని భావిస్తున్నాను' అని పేర్కొన్నారు. అలాగే, నిర్మాత ఆదిత్య, శక్తి ఫిలిమ్స్ అధినేత శక్తివేలన్, కెమెరామెన్ మహేంద్రన్ జయరాజ్, నటుడు పావెల్ నవగీతన్, నటి రిచ్చా జోషి తదితరులు ప్రసంగించారు.

'ఉయిర్ తమిళుక్కు'కు అభినందనల వర్షం



'ఉయిర్ తమిళుక్కు'లో అమీర్

దర్శకుడు అమీర్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉయిర్ తమిళుక్కు'. ఈ నెల 10న విడుదలైన ఈ చిత్రం తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో ప్రదర్శితమవుతుంది. 'యాంటీ ఇండియన్' సినిమాను తెరకెక్కించిన మూన్ పిక్చర్స్ బ్యానరుపై ఆదంబవా నిర్మించి, దర్శకత్వం కూడా వహించారు. రాజకీయ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమాలో హీరోయిన్‌గా చాందిని శ్రీధరన్ నటించగా, ముఖ్య పాత్రల్లో ఇమ్మాన్ అన్నాచ్చి, శరవణ శక్తి, గంజా కరుప్పు తదితరులు నటించారు. ఒక చిన్న విరామం తర్వాత సంగీత దర్శకుడు విద్యాసాగర్ ఈ సినిమా ద్వారా రీఎంట్రీ ఇచ్చారు. ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ అధినేత సుభాస్కరన్ లండన్‌లో ప్రత్యేకంగా తిలకించి, చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందిస్తూ ఒక సందేశాన్ని పంపించారు. అలాగే, పలువురు చిత్రప్రముఖులు కూడా సినిమా బృందాన్ని అభినందిస్తున్నారు. ఈ ప్రాజెక్టు సెట్స్‌పైకి తీసుకెళ్ళినప్పటి నుంచి ప్రేక్షకులతో పాటు సినిమా ప్రముఖుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇపుడు విడుదలైన తర్వాత కూడా ఆ అంచనాలకు తగ్గట్టుగా ప్రేక్షకులు ఆదరిస్తున్నారు.

ఊటీలో పర్యాటకుల సందడి



బొటానికల్ పార్క్‌లో సందర్శకుల సందడి

- ఆకట్టుకున్న 'డాగ్ షో'

పెరంబూర్, మే 12: నీలగిరి జిల్లా ఊటీ బొటానికల్ పార్క్ పర్యాటకులతో కిటకిటలాడుతోంది. పర్యాటకులకు మరింత ఆహ్లాదం కలిగించేలా బొటానికల్ పార్క్‌లో ప్రారంభమైన పుష్ప ప్రదర్శనలో రంగు రంగుల పూలతో రూపొందించిన కొండ రైలు, డిస్నీ వరల్డ్ సహా పలు అలంకారాల వద్ద పర్యాటకులు సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ ప్రదర్శనలో మొదటి సారిగా రాత్రి 'లేజర్ షో' హైలెట్‌గా నిలిచింది. లేజర్ లైట్ల వెలుగుల్లో పర్యాటకులు ఉత్సాహంగా నృత్యం చేస్తున్నారు. బొటానికల్ పార్క్‌తో బోట్ క్లబ్, రోజా పార్క్, కున్నూరు సిమ్స్ పార్క్ తదితర ప్రాంతాలు సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. కోతగిరి సమీపంలోని కొడనాడు వ్యూ పాయింట్ నుంచి తమిళనాడు-కర్ణాటక సరిహద్దు ప్రాంతాలైన పర్వత శిఖరాల మధ్య తెల్లటి మేఘాలు, లోయలు, రాతి స్తంభాలు, పచ్చని పైర్లు తలపించేలా దట్టమైన పచ్చదనంతో కూడిన అడవుల అందాలను పర్యాటకులు ఆస్వాదిస్తున్నారు. ఈ-పాస్ విధానం అమలుకు రావడంతో ట్రాఫిక్ సమస్య లేకుండా, వాహనాల పార్కింగ్, వసతి తదితర సమస్యలు లేకుండా పర్యాకులు సంతోషంగా వెళుతున్నారు.



లేజర్ లైట్ షో ప్రాంతంలో నృత్యం చేస్తున్న పర్యాటకులు



అలరించిన డాగ్ షో..

ఊటీ బొటానికల్ పార్క్‌లో జరుగుతున్న పుష్ప ప్రదర్శన సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన డాగ్ షో పర్యాటకులను మరింత అలరించింది. సౌత్ ఆఫ్ ఇండియా కెన్నల్ క్లబ్ (ఎస్ఐకేసీ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ షోలో విదేశీ రకానికి చెందిన బికాన్ ఫ్రీజ్, ఇంగ్లీషు పాయింటర్, రొడేసియన్ రైడ్‌బాక్, బాసెంజి, కావలీర్ కింగ్, ఛార్లెస్ స్పానీల్, దేశీయ రకాలకు చెందిన కారవాన్ హౌండ్, చిప్పిపారై, కొంబై, కన్ని, ముదోల్ హౌండ్, పామ్మి, రాజపాళయం తదితరాలు సహా 56 రకాలకు చెందిన 450 పెంపుడు శునకాలు పాల్గొన్నారు. శునకాలకు ప్రత్యేక కళ్లద్దాలు, దుస్తులు వేసిన వాటి యజమానులు, శునకాలచేత పలు విన్యాసాలు చేయించారు. ఈ ప్రదర్శనలో ఉత్తమ శునకాలను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు.





ప్రదర్శనలో పాల్గొన్న వివిధ రకాల శునకాలు



























బ్రయాంట్ పార్క్‌లో వికసించిన ఆకుపచ్చ రోజా పూలు

ఆకట్టుకుంటున్న 'ఆకుపచ్చ' రోజాలు

పెరంబూర్, మే 12: కొడైకెనాల్ బ్రయాంట్ పార్క్‌లో ఆకుపచ్చ రోజా పూలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ పార్క్‌లో 26వ తేది వరకు పుష్ప ప్రదర్శన జరుగనుంది. ప్రదర్శన కోసం మూడు నెలల ముందుగానే 3,000లకు పైగా రోజా మొక్కలు నాటారు. ప్రస్తుతం వాటిలో 500 మొక్కలకు పూలు పూస్తున్నాయి. ముఖ్యంగా, ఆకు పచ్చ రోజా పూలు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



చెన్నై, టి.నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన రామానుజ తిరునక్షత్ర వేడుకలు

నటుడు అప్పుకుట్టి పెద్ద మనసు

- స్కూల్‌కు రూ.11 లక్షల విలువైన వస్తువుల దానం



అడయార్, మే 12: సినీ నటుడు అప్పుకుట్టి పెద్దమనసు చూపించారు. తాను చదువుకున్న పాఠశాలకు ఏకంగా రూ.11 లక్షల విలువ చేసే వివిధ రకాలైన వస్తువులను అందజేశారు. అతడి సొంతూరు తూత్తుక్కుడి జిల్లాలోని నాదన్ కిణరు. అక్కడ జరిగే ముత్తరమ్మన్ ఆలయ వార్షిక వేడుకల కోసం అప్పుకుట్టి వెళ్ళారు. ఈ సందర్భంగా అయన రూ.11 లక్షల విలువైన కుర్చీలు, బెంచీలు, కంప్యూటర్లు, టీవీ సహా వివిధ రకాల వస్తువులను కొనుగోలు చేసి ఉచితంగా అందజేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ, 'మా సొంతూరులో ఒకటి, రెండు తరగతులను మాత్రమే చదివాను. ఈ పాఠశాలలో కనీస సౌకర్యాలు లేవు. ఈ కారణంగా ఇక్కడ చదువుకునే విద్యార్థులు అసౌకర్యంగా ఫీలవుతున్నారు. దీంతో పాఠశాలకు అవసరమైన సాయం చేశాను. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు మెరుగ్గా ఉంటే చదువుకునే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నది నా భావన. అలాగే, విదేశాల్లో ఉండేవారు కూడా కొన్ని రోజుల పాటు తమతమ సొంతూర్లకు వచ్చి ఉండాలని కోరుతున్నాను' అని కోరారు.

జన కేతనం



సోమవారం 13 మే 2024



తిరుపతి ప్రచారంలో చంద్రబాబు,పవన్



తిరుపతి రోడ్‌షోలో నడ్డా

పోలింగ్ ఘడియలు సమీపించాయి. ఓటేసేందుకు నరాలు తెగే ఉత్కంఠ రేపిన క్షణాలు దగ్గరపడ్డాయి. ఎన్నికల నోటిఫికేషన్ మొదలు గడచిన పాతిక రోజులుగా ఎన్నో పరిణామాలు వడివడిగా చోటుచేసుకున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి ఆరంభంలో అసమ్మతులు.. ముఖ్య నేతల జోక్యంతో కుదిరిన సమన్వయం..హోరెత్తించిన ప్రచారంలో పాలుపంచుకున్న అగ్ర నాయకులు..కురిపించిన హామీలు..అధికార పార్టీని తుదివరకూ ముచ్చెమటలు పట్టించిన చేరికలు..గడచిన 24 గంటల్లో బేరసారాలు.. లాంటి పలు ఆసక్తికర సంఘటనలతో సాగిన ఎన్నికల సమరం శనివారం సాయంత్రానికి క్లైమాక్సుకు చేరుకుంది.. వాటిని ఒకసారి మననం చేసుకుంటే...

- తిరుపతి (ఆంధ్రజ్యోతి)

సమరం సాగింది ఇలా...

అగ్రనేతలతో హోరెత్తిన ప్రచారం

అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎన్నికల ప్రచారం హోరెత్తించారు. తిరుపతిలో వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి ప్రత్యక్ష ప్రచారంలో పెద్దగా పాల్గొనలేదు. మిగిలిన అభ్యర్థులు ప్రత్యక్ష ప్రచారంలో తలమునకలయ్యారు.

చంద్రబాబు: గూడూరు, నాయుడుపేట, శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, తిరుపతిలలో బహిరంగసభలు నిర్వహించి పార్టీ శ్రేణుల్లో జోష్ నింపారు.

నారా లోకేష్: చంద్రగిరిలో హలో లోకేష్ పేరిట యువతతో ముఖాముఖీ సమావేశమయ్యారు. తిరుపతిలో రోడ్‌షో నిర్వహించారు.

నందమూరి బాలకృష్ణ: వెంకటగిరి, గూడూరు, సూళ్ళూరుపేట, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పర్యటించారు.

పవన్ కళ్యాణ్: తిరుపతి రోడ్‌షో సూపర్ హిట్ చేశారు.

జేపీ నడ్డా: బీజేపీ అధ్యక్షుడు తిరుపతి రోడ్‌షోకు హాజరయ్యారు. జనసేన నేత నాగబాబు కూడా ఇందులో పాల్గొన్నారు.

వైఎస్ జగన్: శ్రీకాళహస్తిలో డ్రైవర్లతో ముఖాముఖీ సమావేశమయ్యారు. వెంకటగిరి, నాయుడుపేట, పుత్తూరుల్లో సభలకు హాజరయ్యారు.

వైఎస్ షర్మిల: శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరుల్లో పర్యటించి ఎన్నికల సభల్లో పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ: చంద్రగిరిలో టీడీపీకి మద్దతుగా రెండు సార్లు పర్యటించారు.

వంగవీటి రాధాకృష్ణ: చంద్రగిరిలో టీడీపీకి మద్దతుగా కాపులతో సమావేశమయ్యారు.

- జతకట్టిన కూటమి నాయకులు
- అసంతృప్తి వీడి విజయానికి కృషి
- అధికార వైసీపీకి అసమ్మతుల తలనొప్పి
- పార్టీ అగ్ర నాయకుల పర్యటనలు
- జిల్లా అభివృద్ధికి పలు హామీలు
- ఓట్ల కొనుగోలుకు తాయిలాలు
- పాతిక రోజుల ఉత్కంఠకు నేడు తెర



తిరుపతిలో చంద్రబాబు,పవన్

ముఖ్య నేతల హామీలివే!

చంద్రబాబు:

- గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా.
- శ్రీకాళహస్తి-తిరుపతి-కాణిపాకంలను టెంపుల్ కారిడార్ చేసి టూరిజం హబ్‌గా అభివృద్ధి పరుస్తా.
- తిరుపతి-శ్రీకాళహస్తి, నెల్లూరులను కలిపి ట్రైసిటీగా అభివృద్ధి చేస్తా.
- గాలేరు-నగరి, హంద్రీ-నీవా, సోమశిల-స్వర్ణముఖి ప్రాజెక్టులు పూర్తి చేస్తా.
- సత్యవేడును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా. సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరిస్తా. బైపాస్ రోడ్లు, సత్యవేడు డిగ్రీ కాలేజీకి శాశ్వత భవనాలు నిర్మిస్తా. సత్యవేడు, వరదయ్యపాలెంలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేస్తా.

నారా లోకేశ్: చంద్రగిరిలో ఐటీ కంపెనీలు ఏర్పాటు చేయిస్తా. **వైఎస్ జగన్:** పులికాట్ పూడికతీత పనులు చేయిస్తా.

కూటమిలో సర్దుబాటు..

వైసీపీలో తలపోటు



పుత్తూరు ప్రచారంలో జగన్

కూటమి మధ్య ఆరంభంలో లుకలుకలు కొంత కలవరపెట్టాయి. తిరుపతిలో టీడీపీ నుంచీ టికెట్ ఆశించినా దక్కని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, జనసేన నుంచి హరిప్రసాద్, కిరణ్ రాయల్, బీజేపీ పక్షాన భానుప్రకాష్ రెడ్డి తదితరులు అసమ్మతి స్వరం వినిపించారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, నాగబాబుల చొరవతో వీరంతా సర్దుకున్నారు.

- చంద్రగిరిలో డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్ వంటివారు సర్దుకుని టీడీపీలో చేరి అభ్యర్థి విజయానికి పనిచేస్తున్నారు.
- నగరిలో వైసీపీ టికెట్ రోజాకు వద్దని చివరి దాకా పోరాడిన అసమ్మతి నేతలు తుదకు పార్టీనే వీడారు.
- శ్రీకాళహస్తిలో ఎస్సీవీ నాయుడు, కోలా ఆనంద్, నగరం వినుత వంటి అధినేతల నిర్ణయాలకు తలొగ్గి అభ్యర్థి విజయానికి కృషి చేస్తున్నారు.
- సత్యవేడులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ అభ్యర్థి అయ్యారు. చిత్తూరు జిల్లా నుంచీ నూకతోటి రాజేశ్ ఇక్కడ వైసీపీ అభ్యర్థిగా తెర మీదకు వచ్చారు. టికెట్ ఆశించిన టీడీపీ నేతల్లో హేమలత, డాక్టర్ హెలెన్‌లు సైలెంటయ్యారు. జేడీ రాజశేఖర్ తిరుగుబాటు అభ్యర్థిగా బరిలోకి దిగి సస్పెండయ్యారు.
- సూళ్ళూరుపేట టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె విజయశ్రీకి దక్కగా ఆ పార్టీలో అన్ని వర్గాలూ ఒక్కటై ఎన్నికల్లో పనిచేస్తున్నాయి. వైసీపీలో వర్గ విభేదాలు ఇంకా పెరిగాయి.
- గూడూరులో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాద్‌కు బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ టికెట్ సాధించారు. ఎమ్మెల్సీ మురళీధర్ వైసీపీ అభ్యర్థిగా అక్కడ పోటీలో దిగారు.
- వెంకటగిరిలో టీడీపీ టికెట్ తొలుత మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ కుమార్తె లక్ష్మిసాయిప్రియకు దక్కగా నామినేషన్ల చివరి క్షణంలో రామకృష్ణకే టికెట్ ఇచ్చారు. అక్కడ వైసీపీ అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పార్టీలో వర్గ విభేదాలతో సతమతమవుతున్నారు.

వైసీపీ నుంచీ టీడీపీలోకి భారీగా చేరికలు

నగరిలో రోజాకు టికెట్ వద్దని పోరాడి అలసిన వైసీపీ ముఖ్యనేతలు చక్రపాణిరెడ్డి, మురళీధర్‌రెడ్డి, లక్ష్మీపతి రాజు, అమ్ములు మొదలియార్ వంటివారు పార్టీ వీడి టీడీపీలో చేరారు. తిరుపతిలో వైసీపీ నుంచీ బీసీ నేత అన్నా రామచంద్రయ్య సహా పలువురు వైసీపీ కార్పొరేటర్లు, డివిజన్ పార్టీ అధ్యక్షులు పార్టీ వీడారు. చంద్రగిరిలో డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధాయాదవ్, పాకాల జడ్పీటీసీ నంగా పద్మజ, సాయినగర్ మాజీ సర్పంచ్ గణపతి నాయుడు, పారిశ్రామికవేత్త రమణమూర్తి వంటి వారు టీడీపీలో చేరారు. వెంకటగిరి ఎంపీపీ తనూజ, సైదాపురం జడ్పీటీసీ ప్రసన్న, మార్కెట్ కమిటీ ఛైర్మన్ భాస్కర్‌రావు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, పెంచలకోన ఆలయ ట్రస్టుబోర్డు మాజీ ఛైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి తదితరులు వైసీపీ నుంచీ టీడీపీలో చేరారు. శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ ఛైర్మన్ ముత్యాల పార్థసారథి, శాప్ డైరెక్టర్ వీరరాఘవులు టీడీపీలో చేరారు. నగరిలో అశోక్ రాజు టీడీపీ నుంచీ, తిరుపతిలో నవీన్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ నుంచీ బీజేపీలోకి చేరారు.

ఓటు..నోటు బేరసారాలు

మున్నెన్నడూ లేనివిధంగా ఈసారి ఓటు బేరసారాలు జరిగాయి. గరిష్ఠంగా ధర రూ. 3500 వరకూ పలికింది. వెంకటగిరిలో వైసీపీ రూ. 3500, టీడీపీ రూ. 2500 చొప్పున, గూడూరులో వైసీపీ రూ. 1500 నుంచీ రూ. 2 వేలు, టీడీపీ రూ. వెయ్యి వంతున ఓటర్లకు పంపిణీ చేశాయి. సూళ్ళూరుపేటలో ఇరుపార్టీలూ రూ. వెయ్యి చొప్పున పంపిణీ చేశాయి. వైసీపీ అదనంగా మద్యం అందజేసింది. శ్రీకాళహస్తిలో వైసీపీ నాయకులు రూ. 3500, చీరలు, ముక్కుపుడక, వెండి మెట్టెలు ఇచ్చారు. టీడీపీ నాయకులు రూ. 2 వేలు లెక్కన పంచారు. సత్యవేడులో వైసీపీ రూ. 1500, టీడీపీ రూ. వెయ్యి వంతున, నగరిలో వైసీపీ రూ. 2 వేల నుంచీ రూ. 2500, టీడీపీ రూ. వెయ్యి వంతున ముట్టజెప్పాయి. తిరుపతి, చంద్రగిరిలలో ఇరు పార్టీల వారూ రూ. 2 వేలు వంతున అందజేశారు.

కనిపించని మద్యం ప్రభావం

ఈ ఎన్నికల్లో మద్యం ప్రభావం పెద్దగా కనిపించకపోవడం విశేషం. సూళ్ళూరుపేట, నగరి నియోజకవర్గాల్లో వైసీపీ వర్గీయులు నగదుకు తోడు మద్యం పంపిణీ చేశారు తప్పితే మిగిలిన నియోజకవర్గాల్లో మద్యం పంపిణీ జరగలేదు.

ఓటర్లలో పైమెట్టు.. ప్రాతినిధ్యం తీసికట్టు

- జిల్లా ఓటర్లలో మహిళలే అధికం
- ఎన్నికల బరిలో అతితక్కువ ప్రాధాన్యం



జిల్లాలో అభ్యర్థుల విజయాన్ని ప్రభావితం చేసే స్థితిలో మహిళా ఓటర్లున్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం అంతంతమాత్రంగానే ఉంటోంది. ఈసారి ఎన్నికలు జరిగే ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో సంఖ్యాపరంగా ఓటర్లలో వీరెక్కువగానే ఉన్నారు. గత నెలలో జిల్లా అధికారులు విడుదల చేసిన తుది జాబితా ప్రకారం 18,12,980 మంది ఓటర్లున్నారు. ఇందులో పురుష ఓటర్ల కంటే 46,136 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో అంటే 1,62,109మంది మహిళా ఓటర్లున్నారు. అయినా జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల నుంచి ప్రధాన రాజకీయ పార్టీల నుంచి ఇద్దరే పోటీపడుతున్నారంటే వీరి ప్రాతినిధ్యం ఏమేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. సూళ్లూరుపేట నుంచి నెలవల విజయశ్రీ (టీడీపీ),నగరి బరిలో ఆర్కే రోజా(వైసీపీ) బరిలో ఉన్నారు.

జిల్లాలో ఓటర్ల గణాంకాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
గూడూరు	1,19,164	1,26,007	34	2,45,205
సూళ్లూరుపేట	1,18,094	1,24,492	24	2,42,610
వెంకటగిరి	1,18,888	1,24,690	4	2,43,582
చంద్రగిరి	1,52,988	1,62,109	62	3,15,159
తిరుపతి	1,49,846	1,52,622	35	3,02,503
శ్రీకాళహస్తి	1,19,973	1,28,549	14	2,48,536
సత్యవేడు	1,04,377	1,10,997	11	2,15,385
మొత్తం	8,83,330	9,29,466	184	18,12,980

ప్రతి ఎన్నికలో అంతంతమాత్రం

అనుకున్నట్టుగా మహిళాబిల్లు అమలైతే 2029లో జరిగే అసెంబ్లీ, లోక్‌సభల్లో సగం సీట్లు మహిళలకు కేటాయించాల్సిందే. అప్పటివరకూ వీరు అరకొరతో సరిపెట్టుకోవల్సిందేనని చరిత్ర చెబుతోంది. ఈ ఎన్నికల వేళ ప్రస్తుత, పూర్వపు ఉమ్మడి జిల్లా నుంచి మహిళా ప్రాతినిధ్యం ఒకసారి పరిశీలిస్తే.. కుతూహలమ్మ అయిదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వేపంజరి నియోజకవర్గం నుంచి నాలుగుసార్లు గెలిచారు. జీడీనెల్లూరు ఏర్పడ్డాక 2009లో ఒకసారి విజయం సాధించారు. అయిదు సార్లు గెలిచినా ఈమె హ్యాట్రిక్ మిస్సయ్యారు. ఆ ఘనతను చంద్రగిరి నుంచి 1999, 2004,2009లలో వరుసగా ఎన్నికైన గల్లా అరుణకుమారి దక్కించుకున్నారు. ఈమె అంతకుముందు 1989లో కూడా చంద్రగిరి నుంచి గెలిచారు. సుగుణమ్మ(తిరుపతి-2015), రోజా (నగరి-2014,2019),హేమలత (సత్యవేడు-2009), లలితకుమారి (పలమనేరు-2009),ఝాన్సీలక్ష్మి(చిత్తూరు-1983), సత్యప్రభ (చిత్తూరు-2014),అనసూయమ్మ(తంబళ్లపల్లి-1967, 1972),ఏవీ లక్ష్మీదేవమ్మ (తంబళ్లపల్లి-1985, 1994) ప్రాతినిధ్యం వహించారు. తొలినాళ్లలో పుంగనూరు నుంచి 1970,1972లలో రాణి సుందర్మణి గెలుపొందారు.తిరుపతి జిల్లాలో విలీనం కాక మునుపు వెంకటగిరి నుంచి నేదురుమల్లి రాజ్యలక్ష్మి 1999,2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

- తిరుపతి(కలెక్టరేట్)

కరెంటు పోయినా ఈవీఎం ఓకే..

కరెంటు పోతే ఈవీఎం పనిచేయదా? ఓటు వేసే సమయంలో కరెంటు పోతే ఈవీఎం పనిచేస్తుందా లేదా అన్న సందేహం చాలామందిలో ఉండొచ్చు. కానీ మన ఈవీఎంలు విద్యుత్ కనెక్షన్లు లేకపోయినా పనిచేస్తాయి. సాధారణ 7.5 వోల్ట్ ఆల్కలిన్ పవర్‌ప్యాక్‌తో పనిచేస్తాయి

● మొరాయిస్తే...

ఈవీఎంలు మొరాయిస్తే పోలింగ్‌కు అంతరాయం కలుగుతుంది. ఈవీఎంలో కంట్రోల్ యూనిట్ (సీయూ), వీవీప్యాట్, బ్యాలెట్ యూనిట్ (బీయూ) మూడు సక్రమంగా పనిచేయాలి. సీయూ, బీయూ పనిచేయకపోతే వాటితో పాటు వీవీ ప్యాట్‌ను మార్చి తనిఖీ చేస్తారు. సీయూ బ్యాటరీ, వీవీ ప్యాట్ పనిచేయకపోతే వాటిని మాత్రమే మారుస్తారు. పోలింగ్ మధ్యలో మొరాయించినా, పనిచేయకపోయినా కొత్తవి ఏర్పాటు చేస్తారు. అప్పటివరకు పోలైన ఓట్ల వీవీప్యాట్లను భద్రపరుస్తారు. ఓట్ల లెక్కింపు అనంతరం వీవీ ప్యాట్లతో ఫలితాలు తారుమారయ్యే అవకాశం ఉంటేనే వీవీ ప్యాట్లను లెక్కిస్తారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఖైదీలకూ ఓటు అవకాశం

వివిధ కారణాలతో జైలు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు. వారు తం నియోజకవర్గం, పోలింగ్‌బూత్, ఓటరు క్రమసంఖ్యను తెలియజేస్తూ జైలు అధికారిని రాతపూర్వకంగా కోరాలి. వారి అభ్యర్థన లేఖను జిల్లా ఎన్నికల అధికారులకు ఆయన అందజేయాలి. దరఖాస్తును పరిశీలించాక రిటర్నింగ్ ఆఫీసర్ పోస్టల్ బ్యాలెట్‌ను తెప్పించి ఖైదీలకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. పీడీ చట్టం కింద ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులో కడప సెంట్రల్‌జైలులో ఉన్న ఓ ఖైదీ ఇలా ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. అతనికి మాత్రం అవకాశం కల్పించారు. మిగిలిన ఖైదీలెవరూ పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోలేదని అధికారులు తెలిపారు. కాగా మానసికవైకల్యం ఉన్నవారికి ఓటు వేసే అవకాశం ఉండదు.

- లతదకవనాఅఒ

చూపుడు వేలు లేకుంటే సిరాచుక్క ఇలా...

సాధారణంగా పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే స్లిప్ వివరాలు పరిశీలించాక ఓటు వేసే ముందు ఎడమచేతి చూపుడు వేలిమీద నీలిరంగు సిరా చుక్క పెడతారు. ఈ సిరాచుక్క ఉందంటే ఓటేసినట్లు గుర్తు. ఒకవేళ ఓటరు ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే ఏ వేలుకు సిరా చుక్క పెడతారనే సందేహం కొందరికి రావచ్చు. గతంలో దీనిపై అధ్యయనం చేసిన ఎన్నికల సంఘం ప్రత్యామ్నాయ విధానాన్ని సూచించింది. మధ్య వేలు లేదా బొటన వేలుమీద సిరా చుక్క పెట్టొచ్చని పేర్కొంది. కుడి చేయి చూపుడు వేలుకు, ఉంగరం వేలుకు కూడా ఈచుక్క పెట్టవచ్చు. రెండు చేతులకు వేళ్ళు లేకపోతే ఏంచేస్తారనుకుంటున్నారా.. అలాంటి పరిస్థితి ఎదురైతే చేతిపై భాగంలోనూ సిరా చుక్క పెట్టే వెసులుబాటు కల్పించింది.

- లతదకవనాఅఒ

మన ఓటే మన గళం

యూట్యూబ్‌లో సునాదవాణి పాటలతో ఓటరు చైతన్యం



మన ఓటే మన గళం.. మన ఓటే మన ఆయుధం అంటూ పాటల రూపంలో జనచైతన్య కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది తిరుపతికి చెందిన సునాదవాణి సంస్థ. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ ఓటు వేయాలనే పిలుపును పాట, ఆట రూపంలో ఆల్బమ్‌లు రూపొందించి యూట్యూబ్‌లో విడుదల చేశారు. మన ఓటు మనం వేయకపోతే దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందనే హెచ్చరిక వీరి పాటల్లో చేశారు. ఈ పాటలను సునాదవాణి వ్యవస్థాపక అధ్యక్షులు వాణిశ్రీ రాసి, స్వరకూర్చారు. శిరీష, తనుశ్రీ, వసుప్రదలు పాడారు. సునాదవాణి పేరుతో యూట్యూబ్‌లో ఈ పాటలు చూడచ్చు.

- తిరుపతి

తెలంగాణాలో 9 సీట్లు గెలుస్తాం

మాజీ గవర్నర్ తమిళిసై జోస్యం

చెన్నై, మే 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలో తమ పార్టీ నవరత్నాలకు తక్కువ (తొమ్మిది మంది అభ్యర్థులు)కాకుండా తొమ్మిది సీట్లను గెలుచుకుంటుందని మాజీ గవర్నర్, దక్షిణ చెన్నై బీజేపీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ జోస్యం చెప్పారు. ఆమె ఆదివారం చెన్నై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తాను హైదరాబాద్, సికింద్రాబాద్, మెదక్‌తో సహా తొమ్మిది స్థానాల్లో ఎన్నికల ప్రచారం చేశానని, ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ సారి ఎన్నికల్లో కనీసం తొమ్మిదిమంది తెలంగాణలో విజయం సాధిస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా, ఆ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయలేక విఫలమైపోయిందన్నారు. ముఖ్యంగా మహిళలకు రూ.2500 నెలవారి పింఛన్, వృద్ధులకు రూ.4 వేలు, రైతులకు రూ.15 వేల ఆర్థిక సాయం, రూ.2 లక్షల వరకు రుణమాఫీ వంటివి ఇంకా అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలంటే ఐదు రాష్ట్రాలకు సరిపడే బడ్జెట్ కావాలని తమిళిసై ఎద్దేవా చేశారు.

ఎంజీఆర్ బాటలో నటుడు విజయ్

● మాజీ మంత్రి సెల్లూరు రాజు

ఐసిఎఫ్, మే 12: దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ బాటలో నటుడు విజయ్ పయనిస్తున్నాడని అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూరు రాజు కితాబిచ్చారు. మదురై అన్నాడీఎంకే కార్యాలయంలో ఆదివారం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సెల్లూరు రాజు విలేఖరులతో మాట్లాడుతూ... నటుడు విజయ్ కొత్త రాజకీయపార్టీ స్థాపించడాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎంజీఆర్ తన సంపాదన ప్రజల కోసం వినియోగిస్తున్నారని, అదే బాటలో నటుడు విజయ్ కూడా విద్యార్థులు, మహిళలకు అందజేయడ అభినందనీయమని సెల్లూరు రాజు తెలిపారు.

ప్రజలు మత రాజకీయాలను అనుమతించరు

● టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి

పెరంబూర్, మే 12: రాష్ట్రప్రజలకు దైవభక్తి అధికమని, అదే సమయంలో మత రాజకీయాలను వారు అంగీకరించరని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) మాజీ అధ్యక్షుడు కేఎస్ అళగిరి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో, పుదుచ్చేరి, తమిళనాడులోని 40 లోక్‌సభ స్థానాలను డీఎంకే-కాంగ్రెస్ కూటమి కైవసం చేసుకుంటుందన్నారు. వివిధ పథకాలు ముఖ్యమంత్రి స్టాలిన్ అందిస్తుండడంతో మహిళలు కూడా డీఎంకే కూటమిని ఆదరిస్తున్నారన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ బలం తెలుస్తుందని ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కోవై నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లో ఏజెంట్లు కూడా నియమించుకోలేని ఆ పార్టీ అధ్యక్షుడు అన్నామలై అక్కడ ఎలా గెలుస్తారని అళగిరి ఎద్దేవా చేశారు.

డీఎంకే మూడేళ్ల పాలన బహుమతి స్టాంప్ డ్యూటీ పెంపు



70 కిలోల కేక్ కట్ చేస్తున్న ఈపీఎస్

- ఎడప్పాడి పళనిస్వామి విమర్శ
- సేలంలో భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్న ప్రతిపక్ష నేత

ప్యారీస్, మే 12: మూడేళ్ల డీఎంకే పాలన ఘనత ఏమైనా ఉందంటే.. స్టాంప్ డ్యూటీ పెంచడమేనని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విమర్శించారు. ఆదివారం 70వ వసంతంలోకి అడుగిడిన సందర్భంగా ఈపీఎస్‌కు పలు పార్టీల నాయకులు, పారిశ్రామికవేత్తలు, సినీ కళాకారులు, అన్నాడీఎంకే శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. సేలం నెడుంజాలై నగర్‌లోని తన నివాసంలో ఈపీఎస్ కుటుంబసభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య ప్రత్యేకంగా తయారుచేయించిన 70 కిలోల కేక్ కట్ చేశారు. మాజీ మంత్రులు సెమ్మలై, కేపీ అన్బళగన్, బాలకృష్ణారెడ్డి, దళవాయ్ సుందరం, కామరాజ్, డా.సి.విజయభాస్కర్, ఎమ్మెల్యే విజయభాస్కర్ సహా మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ... డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ప్రజలకు కష్టాలు మొదలయ్యాయని, ఈ మూడేళ్లలో ప్రజల జీవన విధానాన్ని ప్రకాశవంతం చేస్తామని ఇచ్చిన హామీని మరచి చీకటి పాలన చేస్తున్నారని విమర్శించారు.రాష్ట్రప్రజలపై పన్నులభారం మోపడమే డీఎంకే లక్ష్యమని, తాజాగా స్టాంప్ డ్యూటీ ఫీజు పెంచారన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ అందిస్తున్న పలు సేవల ఫీజులను పెంచుతూ విడుదల చేసిన జీవోను తక్షణం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మద్రాసు హైకోర్టు తీర్పు ప్రకారం గైడ్ లైన్ విలువను ముందున్న పరిస్థితి ప్రకారమే కొనసాగించాలని, ముఖ్యంగా ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ఛార్జీలు తగ్గించాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, పళనిస్వామికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు, సినీనటుడు విజయ్ ఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

అన్నాడీఎంకే కార్యాలయంలో...

స్థానిక రాయపేటలోని అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి 70వ జన్మదిన వేడుకలను కోలాహలంగా జరుపుకున్నారు. మాజీ మంత్రులు సి.పొన్నయ్యన్, ఓఎస్ మణియన్ నేతృత్వంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ ప్రిసీడియం ఛైర్మన్ తమిళ్‌మగన్ హుస్సేన్, పలు విభాగాల జిల్లా కార్యదర్శులు ఆర్ఎస్ రాజేష్, నుంగై సెల్వకుమార్, నీలకంఠన్ తదితరులు పాల్గొన్నారు.